
# కర్తవ్యం

కథ

కారంపూడి వెంకట రామదాసు




సూర్యం ఆ ఫైల్ని దీర్ఘంగా స్టడీ చేస్తున్నాడు ఎన్నిసార్లు స్టడీ చేస్తే అన్ని అవకతవకలు బయటపడుతున్నాయి. 'ఊఁ' అనీ నిట్టూర్చాడు. -యిప్పుడు ఎంత స్టడీ చేసి ఏం లాభం? అంతా అయిపోయాకా! అన్నీ క్రమబద్ధంగానే జరిగాయి.

ఎంక్వయిరీ, రొటేషన్, ఆర్డరూ అన్నీ రూల్ ప్రకారమే జరిగాయి. కానీ ఆ వ్యవహారంలో నిజాయితీ లేదు. ఒకటా రెండా ఏకంగా వంద టన్నుల స్టీల్ కొనుగోలు చేయబడింది. సరుకు సప్లై అయిపోవడం, వాటి వినియోగం అన్నీ అయ్యాయి. ఫైనల్గా బిల్లు పాస్‌కి సూర్యం దగ్గర కొచ్చింది. కళ్ళు మూసుకునే బిల్లు పాస్ చేయలేకపోతున్నాడు. అసలే కంపెనీ నష్టాల్లో వుంది. ఆ నష్టాల్నుండీ బయటపడ్డానికి ఆధునీకరణే తరుణోపాయమని తలచీ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది.

ఆధునీకరణ చేసే ముందు మొత్తం స్టాఫ్‌ని సమావేశపరచి ఎమ్.డి. ఒకే ఒక్క మాటన్నారు. ''ఈ కంపెనీ కాపాడుకోవడానికి మీకు యిదే చివరి అవకాశం. మీరంతా ఏక కంఠంతో ప్రతిన పూనండి. రాబోయే ఆరునెలలూ కష్టపడీ పనిచేస్తామనీ. కంపెనీకి ఏ విధమైనా నష్టం కలగనివ్వమనీ వీలైతే ప్రతి ఒక్కరూ ఒక్క రూపాయయినా మీ వంతుగా కంపెనీకి ఆదా చెయ్యడానికి కృషి చేస్తామని'' అన్నాడు.

ఎంతమంది మనస్ఫూర్తిగా ప్రతిజ్ఞ చేసారో తెలీదు కానీ సూర్యం మాత్రం మనసావాచా కర్మేణా ప్రతిజ్ఞ చేసాడు.

ఇదిగో అందుకే కళ్ళు మూసుకుని బిల్లు పాస్ చెయ్యలేకపోతున్నాడు.

ఉదయం నుండీ బిల్లు పాస్ చెయ్యకుండా కుస్తీ పుడుతున్న సూర్యంని చూసీ ''ఏంటయ్యా అంతగా ఆలోచిస్తున్నావు. ఆ బిల్లు ఎవరిదనుకుంటున్నావు. యాదిరెడ్డిది. అంటే ఎవరో తెలుసా? ఈ ఏరియాకే బడా కాంట్రాక్టర్ ఎవరి బిల్లైనా ఆపొచ్చుగానీ అతడి బిల్లును ఆపడం మన తరం కాదు. అందుకే కళ్లు మూసుకునీ పాస్ చేసై'' అనుభవం మీద సలహా యిచ్చాడు తోటి ఉద్యోగి ఆచారి.

సూర్యం వేరే ప్లాంట్ నుండీ రెండు నెలల క్రితమే ట్రాన్స్‌ఫర్ అయి యిక్కడి కొచ్చాడు. అతడి ట్రాన్స్‌ఫర్‌కి అసలు కారణం సిన్సియర్‌గా పనిచేసే అతడిలాంటి వాళ్ళ అవసరం ఈ యూనిట్‌కి యిప్పుడున్న పరిస్థితిలో ఎంతో అవసరం. అందుకే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ.డి.) ఏరి కోరి సూర్యంని అక్కడకి రప్పించుకున్నారు.

ఆచారి చెప్పిన విషయాన్ని పెద్దాగా పట్టించుకోలేదు. ఈ యాదిరెడ్డీ, మరొకడు అని ప్రెషర్‌కి తలొగ్గి కళ్ళు మూసుకుని పని చేస్తే యిక కంపెనీ పని అంతే అని అనుకున్నాడు. అందుకే మళ్ళీ మళ్ళీ ఆ ఫైల్ తిరగవేసాడు.

యాదిరెడ్డికి ఆర్డరిచ్చే ముందు ప్రైజ్ నెగోషేషన్ సరిగ్గా జరగలేదు. ఒకే ఒక కొటేషన్ మాత్రమే తెప్పించబడింది. అదీ యాదిరెడ్డి నుండి మాత్రమే! ఆర్డరిచ్చినప్పటి మార్కెట్ రేటుకంటే టన్నుకి వెయ్యి రూపాయిల ఎక్కువకే కొనబడింది. ఈ తతంగమంతా నడిపించిన పాత ఆఫీసర్ యిప్పుడక్కడ లేదు. అందుకే ఏం చెయ్యలేని పరిస్థితి. అలాంటి వారి మూలంగానే కంపెనీకి యిప్పుడీ దుస్థితి. అయినా ఈ విషయాన్ని వదిలిపెట్టకూడదనుకున్నాడు.

★★★

''అన్న.. ఎవరో సూర్యమట కొత్త పోరగాడొచ్చిండు మన బిల్లు పెండింగు పెట్టిండు బిల్లు పాస్ గాలే'' అవమానంగా ఫీలౌతూ అన్నాడు యాదిరెడ్డి అనుచరుడు సైదులు.

''ఏందీ బిల్లు పాస్ గాలేదా? ఓడ్రా ఆడూ? మన సంగతి తెలీదా ఏందీ''

''తెలిసే అట్టా చేసాడన్నా ఎందుకంటే మన ఆచారి లేడూ మన విషయం చెప్పిండు. పెండింగు బెట్టకూ అన్నడంటా. అయినా యినుకోలేదట''

''ఆ పోరెగాడ్ని లైన్లో బెట్టు మన సంగతి సమజయ్యేటట్టు జెస్త''

వెంటనే లైను కలిపాడు సైదులు.

''హల్లో సూర్యం మాట్లాడుతున్నా చెప్పండి'' అన్నాడు సూర్యం.

''చూడాఫీసర్ నీకెంత కావాల్నో జెప్పరాదూ మేటర్ ఖతం. మనం మనం ఒకరికొకరు మదత్ జేస్కోవాలా సమజయిందనుకుంటా ఏం?'' తన యధావిధి ఆయుధమైన లంచాన్ని ఎరవేసాడు యాదిరెడ్డి. ఈ మాటలకి సూర్యం ఒళ్ళు మండింది. కష్టం మీద తమాయిచుకున్నాడు. దీంతో అతడికి ఓ విషయం అర్థమైంది. ఖచ్చితంగా తన ముందాఫీసర్ యాదిరెడ్డి నుండి బాగా మింగేసాడు.

''నేనూ యాదిరెడ్డి మాట్లాడుతుండా నా బిల్లు ఏం చేస్తివి? చెక్కు ఎప్పుడు ముడ్దది''

''ఆ పనిలోనే వున్నా నేనే మీతో మాట్లాడాల నుకుంటుండగా, మీరే ఫోన్ చేసారు. అసలా ఆర్డరే అవకతవలమయం. మీకు ఆర్డరిచ్చిన సమయంలో మార్కెట్టు రేటుకంటే చాలా ఎక్కువ రేటుకి మీరు సప్లై చేసారు. ఆడిట్ ప్రొబ్లమ్స్ చాలా వుంటాయి. అందుకే ఫైల్ పునఃపరిశీలించి బిల్లు పాస్ చేస్తాం''

''గదేంటి ఆర్డరిచ్చుండ్రూ గాప్రకారం సప్లై జేసినా గిప్పుడు గిట్లంటవేంటీ కొత్తగా వచ్చిండవు నీకు తెల్వదులాగుంది. నీ గాఫీసర్నడగరాదూ వెంటనే బిల్లు పాస్ జేసి పే చెయ్యండ్రి''

''అది కాదు నేనొకసారి సావధానంగా పరిశీలించనిదే బిల్లు పాస్ కాదు'' ఖచ్చితంగా చెప్పాడు సూర్యం.

వీడెవడో తలతిక్క ఆఫీసర్ వచ్చాడనుకునీ–

''చూడాఫీసర్ నీకెంత కావాల్నో జెప్పరాదూ మేటర్ ఖతం. మనం మనం ఒకరికొకరు మదత్ జేస్కోవాలా సమజయిందనుకుంటా ఏం?'' తన యధావిధి ఆయుధమైన లంచాన్ని ఎరవేసాడు యాదిరెడ్డి.

ఈ మాటలకి సూర్యం ఒళ్ళు మండింది. కష్టం మీద తమాయిచుకున్నాడు. దీంతో అతడికి ఓ విషయం అర్థమైంది. ఖచ్చితంగా తన ముందాఫీసర్ యాదిరెడ్డి నుండి బాగా మింగేసాడు.

''నో మీ బిల్లు మీకు చెల్లించడానికి నా కెటువంటి అభ్యంతరం లేదు. కాకాపోతే ఓ వారం రోజులు ఆగండి''

''సరే సరిగ్గా వారం ఆగుతా బిల్లు పాస్ గాలేదో ఏం జెయ్యల్నో నాకు బాగా ఎరిక'' హెచ్చరికలాంటిది వదిలాడు యాదిరెడ్డి.

మారు మాట్లాడకుండా ఫోన్ పెట్టేసాడు సూర్యం.

''నువ్వు ఫికర్ చెయ్యకరా. వారం పోనాకా ఆ పోరోడ్ని గలిసి ఫైసల్ పట్టుకురా పో'' అన్నాడు యాదగిరిరెడ్డి సైదులుతో.

అన్న నా మజాకా మనసులో అనుకున్నాడు సైదులు.

ఇటు సూర్యం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఈ కేసుని ఎలా డీల్ చెయ్యాలా అని. ఎట్టి పరిస్థితిలోనూ కంపెనీ నష్టపోకూడదన్నది అతడి ఆలోచన. అయితే, ఈ స్టేజ్ లో అతడి బిల్లుకి కోత పెట్టే ఆస్కారం కనబడటం లేదు. మహా అయితే మరో నెలరోజులు పేమెంట్స్ అదిగో యిదిగో అని ఆపగలడు ఆపై సెటిల్ చెయ్యకతప్పదు. అందుకే సమయం, అవకాశం కోసం చూసీ ఈ నష్టాన్ని అతడి నుండే పూడ్చుకోవాలి మనసులో అనుకున్నాడు. యాదిరెడ్డి బిల్లు ఆపొద్దని అక్కడి స్టాఫ్ చాలా మందే చెప్పారు. అయినా తన ధోరణి మార్చుకోలేదు సూర్యం.

★★★

అది లంచ్ సమయం.

సమయం పట్టించుకోకుండా తన పనిలో బిజీగా వున్నాడు సూర్యం. యింతలో మొబైల్ మ్రోగితే రిసీవ్ చేసుకున్నాడు.

''హాయ్ సూర్యం హౌ ఆర్ యూ?'' అంటూ అటు వైపు చిన్ననాటి స్నేహితుడు సురేష్.

''హాయ్..సురేష్...వాటే ఎ సర్ ప్రైజ్..నైస్ టు హియర్ యూ'' అన్నాడు చాలా రోజులకి కాంటాక్ట్ చేసిన స్నేహితుడి గొంతు గుర్తు పట్టిన సూర్యం.

''ఆఁ.. ఎలా వున్నావు? నీకు ప్రమోషన్ మీద మీ సెకండ్ యూనిట్‌కి వేసారని మన వీరిగాడు చెప్పి నీ నెంబర్ కూడా యిస్తే వెంటనే చేస్తున్నాను. కంగ్రాట్స్!'' అన్నాడు సురేష్.

యిప్పుడర్థమైంది సూర్యంకి, సురేష తననెలా పట్టుకోగలిగాడా అని.

''ఆఁ..థాంక్స్! సరే... యింతకీ నువ్వెక్కడు న్నావు? ఏం చేస్తున్నావు?'' కుతూహలంగా అడిగాడు సూర్యం.

''అల్ట్రాటెక్ సిమెంట్, తాడిపత్రిలో సేల్స్ మేనే

జర్ పోస్ట్ ఆదిత్య బిర్లా గ్రూప్ ఆఫ కంపెనీస్, వెల్ సెటిల్డ్. యిప్పుడు సిమెంట్ యిండస్ట్రీస్ బూమ్ లో వున్నాయి. సో..హేపీగానే వుంది''

యిద్దరి మధ్యా ఎన్నో సంగతులు దొర్లాయి. పర్సనల్ మేటర్స్ యింట్రస్టింగ్ ప్రొఫెషనల్ మేటర్స్ యిలా చాలా సంగతులు తరువాత ఒకరి కొకరు బై చెప్పుకున్నారు.

ఆ తరువాత కనీసం రోజుకోకసారైనా యిద్దరూ ఫోన్లో పలకరించుకునేవారు. ఆఫీసవర్స్ లో మాత్రం కాదు. ఏ లంచ్ సమయంలోనో ఈవి నింగ్ టైమ్లో మాత్రమే.

రెండ్రోజులుగా సురేష్ ఫోన్ చెయ్యకపోయేస రికి ఆ రోజు లంచ్ అవర్లో సూర్యమే ఫోన్ చేసాడు.

''ఏంరా...! రెండ్రోజులైనా ఫోనే చెయ్యడం లేదు. అంత బిజీనా?'' అన్నాడు సూర్యం.

''అవునా... ఓ యింపార్టెంట్ మీటింగ్ రెండ్రో జులుగా యిక్కడ సాగుతున్నది. నిజానికి యిదిగో యిప్పుడే ఆ మీటింగ్ ఫినిషైంది. కాస్త ఊపిరి పీల్చుకుంటుండగా నీ ఫోన్?''

''ఏంట్రా అంత యింపార్టెంట్ మీటింగ్?''

''అవున్రా యింపార్టెంట్! ఈ మీటింగ్ లో సేల్స్ మేటర్ల పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు'' అంటూ వివరంగా చెప్పాడు సురేష్.

''వెరీ యింట్రస్టింగ్'' అంటూ సూర్యం స్నేహి తుడు చెప్పిందంతా నిదానంగా విన్నాడు. ఆ తరు వాత యిద్దరి మధ్యా ఎన్నో విషయాలు...చిన్న నాటి చిలిపి జ్ఞాపకాలూ చాలా మాట్లాడుకున్నారు.

''సార్! ఈ ఫైల్ చాలా అర్జెంటంట ఇ.డి. పంపారు. చూసి వెంటనే ఏక్షన్ తీసుకోమన్నారు'' అన్నాడు ఆచారి లంచ్ ముగించుకుని వచ్చిన సూర్యంతో.

''సరే..!'' అంటూ వెంటనే ఆ ఫైల్లో పడ్డాడు సూర్యం.

స్టడీ చేసిన అతడికి అందులో పెద్ద విశేషమేమి కనబడలేదు. రొటీన్ పర్చేజ్ మేటర్! కాకపోతే అర్జంట్ రిక్వైర్మెంట్. సరేనని ఆ పనిలోపడ్డాడు. యింతలో లేండ్ లైన్ ఫోన్ మ్రోగింది. రిసీవ్ చేసు కున్నాడు సూర్యం.

''ఆ యాదిరెడ్డి బిల్లు ఏమైంది? యింకా ఎందుకు పాస్ కాలేదు? వెంటనే పాస్ చేసి చెక్కు రెడీ చెయ్యండి?'' వైస్ ప్రెసిడెంటు నుండీ ఆ ఫోను.

''అదీ'' అని ఏదో చెప్పబోయాడు. ఆ సరికే యిక వినేది లేదన్నట్టుగా లైన్ కట్ చేసాడు వైస్-ప్రెసిడెంట్.

'ఊఁ యాదిరెడ్డి ఈ రూట్లో వచ్చాడన్నమాట' సరే! అనుకుని ఆ ఫైల్ వెదికి తీసి పెట్టుకున్నాడో లేదో మళ్లీ ఫోన్.

''సూర్యంగారా? యిటు సైదులు మాట్లాడు తుండా... మా బిల్లు సంగతి ఏం చేసారు సార్''

''బిల్లు పాస్ చేస్తామయ్య తొందరేంటంట?'' కాస్త విసుగ్గానే అన్నాడు సూర్యం.

''అది కాదు, మా సార్ యాద్ చెయ్యమ నింఁడ్రూ కాస్త చూడండి''

సూర్యంకి ఒళ్ళుమండింది అయితే తనని తాను తమాయించుకున్నాడు.

''సరే చూస్తాలే''

''ఆఁ అన్నట్లు మీరు ఒక్క స్టీలేనా వేరే ఏమైనా డీల్ చేస్తారా?'' అడిగాడు సూర్యం.

''స్టీల్, సిమెంట్, సిమెంటు రేకులూ అన్నీ డీల్ జేస్తం ఏం?''

''ఆఁ మీ సార్ వున్నాడా?'' అన్నాడు సూర్యం.

ఆశ్చర్యపోవడం సైదులు వంతైంది. యిప్పటి వరకు కాదూ పోదు అన్నతడు సడన్గా నెమ్మ దయ్యే సరికి ఆశ్చర్యపోయాడు.

''ఈడ లేడు దవాఖానాకి పోయిండు. గంటలో వస్తడు''

''సరే మీ సార్ రాగానే ఫోన్ చెయ్యి''

''ఆఁ వీలైతే ఈ రోజే చెక్ రెడీ చేస్తానని చెప్పు''

''మంచిది సారూ'' సంతోషంగా అన్నాడు సైదు.

సూర్యం వెంటనే యాదిరెడ్డి బిల్లు తీసి చక చక పాస్ చేసేసాడు. అకౌంట్స్ సెక్షన్కి ఫోన్ చేసి తాను బిల్లు పంపుతాన్నాననీ, ఓ గంటలో చెక్ రెడీకావా లని వెరీ అర్జంటని చెప్పాడు.

సూర్యం అర్జంటన్నాడంటే తప్పక కారణ ముంటుందని వెంటనే ఏక్షన్ మొదలుపెట్టారు అకౌంట్స్ సెక్షన్.

★★★

''సార్... మీరు బయటకెళ్లినప్పుడు, సూర్యం ఫోన్ చేసుండు సార్ యియ్యాలే, చెక్కు రెడీ చేస్త డంట మీతో ఏదో మాట్లాడలన్నడు''

యాదిరెడ్డి మొహంలో చిరునవ్వు.

''ఎవుని కోసం చెయ్యడు? ఈ యాదిరెడ్డి సిమెంట్ ఆపే దమ్ము ఆడ ఎవుడికీ లేదు'' గర్వంగా అన్నాడు.

''ఔ... మల్లా'' వంతపాడాడు సైదులు.

''సరే ఆ సూర్యంన్ని లైన్లో పెట్టు యిసయం ఏందో చూద్దాం''

సైదులు వెంటనే ఫోన్ కలిపాడు.

''యాదిరెడ్డి మాట్లాడుతుండా... నన్ను ఎందుకో యాద్ చేసిన వంట... ఏంటి యిసేసం? ''

''సార్... మీ చెక్కు మరో గంటలో రెడీ చేస్తు న్నాం...సైదుల్ని పంపి తీసుకోవచ్చు''

''ఆఁ...'' పెద్ద ఆసక్తి లేనట్టు అన్నాడు యాదిరెడ్డి.

''సరే మీరు సిమెంటు కూడా డీల్ చేస్తారని విన్నాను. మీ దగ్గర రెడీ స్టాక్ వుందా?'' ఇ.డి. పంపిన ఫైల్లో రిక్వైర్మెంట్ గుర్తుపెట్టుకొని అడి గాడు.


''లేకేం మస్తుగా స్టాకుంది. ఎంత కావల?''


''ఓ ఐదువేల బస్తాలు''

''ఔ వుంటది''

''ఎంత రేటు?''

''రేటు కోసం ఫికర్ చెయ్యకుండ్రి మీ కంపెనీ



పొజిషన్ నాకు తెల్వదా ఏందీ మీరిడకొచ్చిందే కంపెనీకి మంచి చెయ్యటానికని నా కెరిక. మార్కెట్టు రేటుకే సప్లై జేస్త పో''

''ఎంతకి?''

''బస్తా నూటయనభై''

''రేటు సరే కాకపోతే సరుకు ఈ రోజే అవసరం. రెప్పట్నుండి యిక్కడ సివిల్ వర్క్ స్టార్ట్ చేస్తున్నాం. సరుకు యివాళే లోడ్ చేసి ఇన్వాయిస్ ఫేక్స్ చేసి ఎల్లార్ నెంబర్ చెప్పాలి''

''ఓ అట్లాగనే మరి పేమెంట్ కూడా జల్దీ కావల్న''

''ఆర్డర్ మరో అరగంటలో మీకు ఫేక్స్ చేస్తా సరుకు లోడ్ చేసి ఇన్వాయిస్ నాకు ఫేక్స్ చెయ్యండి. రేపటికల్లా పేమెంట్ సిద్ధం'' హామీ యిచ్చాడు సూర్యం.

''మంచిది. మీ ఆర్డర్ అందిన వెంటనే బిల్లు ఫేక్స్ జేస్త సరుకు కూడా వెంటనే లోడ్ జేస్త'' అంటూ ఫోన్ కట్ చేసాడు.

''సైదులూ! పోరోడు దిగొచ్చిండు రా! చెక్కు రెడీ అయినదట. సిమెంటు ఓ ఐదు వేల బస్తాలకి ఆర్డర్ కూడా యిచ్చిండు. పోరోడు అనుకున్నంత చెడ్డోడు కాదురా'' సంబరంగా చెప్పుకుపోయాడు యాదిరెడ్డి.

మరో గంటకాక ముందే సూర్యం నుండి పర్చేజ్ ఆర్డర్ రావడంతో యాదిరెడ్డి వెంటనే బిల్లు రెడీ చేసి ఫేక్స్ చెయ్యడమే గాకా సరుకు లోడ్ చేసి ఎల్లార్ కాపీ కూడా ఫేక్స్ చేసాడు ప్రూఫ్ ఆఫ్ డిస్పాచ్ కింద.

ఫేక్స్ కాపీలు అందుకున్న సూర్యం హాయిగా ఊపిరిపీల్చుకున్నాడు.

★★★

ఉదయం ఏడు గంటలు.

యాదిరెడ్డి లాన్ లో వున్న ఊయల కుర్చీలో కూర్చుని నింపాదిగా టీ సిప్ చేస్తున్నాడు.

గేటు దగ్గర చప్పుడైందో లేదో పెంపుడు కుక్కలు భౌ...భౌ.... అని అరుపులు మొదలుపెట్టాయి.

వచ్చింది ఎవరా అని గేటుకేసి చూసాడు యాదిరెడ్డి.

గేటు బైట పేపర్ బాయ్...

ముందు పేపరు గాల్లో గిరాటేద్దామనుకున్నాడు కానీ, యింటి యజమాని తనకేసే చూడ్డంతో ఆ ప్రయత్నం మానుకుని లోపలికొచ్చి మర్యాదతో ''సార్ పేపర్'' అని వినయంగా చేతికి అందించి మరీ వెళ్ళాడు.

ఎప్పుడూ పేపర్ చూసే శ్రద్ధా, తీరికా రెండూ లేకపోయినా పేపర్ బాయ్ చేతిలో వుంచి మరీ వెళ్ళడంతో పేపర్ విప్పాడు. ఫ్రంట్ పేజీలో

''సిమెంట్ ధర బస్తాకి యాభై పెంపు, నేటి నుండి అమలు''

తాటికాయంత అక్షరాలతో ముఖ్యాంశంగా ప్రచురింపబడిన ఆ వార్త చదివి యాదిరెడ్డికి కళ్ళు తిరిగాయి. షాక్ తిన్నాడు. అలా యిలా కాదు తాను చదివింది తప్పేమోనని మళ్ళీ మళ్ళీ ఆ వార్తని చదివి నిజమేనని నిర్ధారించుకున్నాడు. మెదడు మొద్దుబారిపోయింది. తాను ఘోరంగా మోసపోయాడు. నష్టం... వందలా వేలా రెండు లక్షలన్నరా... ఏం చేస్తే ఈ నష్టం తీరుతుందీ... ఏ ఉపాయం కనబడలేదు... నిస్సహాయస్థితి మింగా లేకా కక్కాలేని పరిస్థితి.

★★★

సూర్యం రోజూ మాదిరిగా ఆ రోజూ విధులకి సమయానికి హాజరైనాడు.

''సూర్యం ఈ రోజు పేపర్ చూసారా... సిమెంట్ ధర బస్తాకి యాభై పెరిగిందట నిన్నే మీరు ఆర్డర్ ప్లేస్ చేసి కంపెనీకి లక్షల్లో లాభం చేకూర్చారు. కంగ్రాట్స్'' అంటూ ఆచారి అన్నాడు.

''ఈజిట్.. నిజంగానా? ఇంత సడన్‌గా రేటు పెరిగిందా?'' ఆశ్చర్యంగా అన్నాడు సూర్యం.

కొద్దిసేపటికి ఒక్కొక్కరే వచ్చి అభినందించడం మొదలు పెట్టారు.

''మేనేజ్‌మెంట్ ఏరికోరి మిమ్మల్నే యిక్కడికెందుకు వేసారో యిప్పుడర్థమైంది సార్ అంతే కాదు యాదిరెడ్డికి కళ్ళు తిరిగుంటాయి'' అన్నాడు ఆచారి.

''కంగ్రాట్స్..సూర్యం....నే పంపిన ఫైల్ని వెంటనే స్టడీ చేసి సరైన సమయంలో యాక్షన్ తీసుకోవడంతో కంపెనీకి పెద్దలాభం చేకూరింది. కర్తవ్య నిర్వహణలో నీకు నువ్వే సాటి...కీపిట్ అప్'' ఇ.డి. స్వయంగా సూర్యం సీటు వద్దకొచ్చి ప్రశంసల జల్లు కురిపించాడు.

సూర్యం తనలో తాను నవ్వుకున్నాడు.

అప్రయత్నంగా నిన్న లంచ్ అవర్లో సురేష్ తో జరిపిన మొబైల్ సంభాషణ గుర్తుకొచ్చింది.

''సిమెంట్ మాన్యుఫేక్చరర్స్ అంతా కలసి ఓ కీలక నిర్ణయాన్ని తీసుకొనేందుకే ఈ మీటింగ్ రెండ్రోజుల తర్జనభర్జనల మధ్య అంతా కలిసి ఓ నిర్ణయానికొచ్చాం. దాని ఫలితమే తెల్లవారితే సిమెంటు ధర బస్తాకి యాభై పెంపు... ఈ న్యూస్ రాత్రి మీడియాకి వెళ్తుంది అప్పటి వరకూ సీక్రెట్''

ముందు ఈ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు సూర్యం. కానీ ఎప్పుడైతే ఇ.డి. నుండి సిమెంటు కొనుగోలుకి శాంక్షన్ ఫైలు వచ్చిందో సురేష్ అందించిన సమాచారం అవకాశంగా తీసుకుని యాదిరెడ్డికి బుద్ధిచెప్పడంలో సఫలీకృతుడైయ్యాడు.

యాదిరెడ్డికే కాదు సూర్యం సహోద్యోగులందరికీ కూడా అసలు సూర్యం ఈ పని తెలిసే చేసాడో లేక యాదృచ్ఛికంగా జరిగిపోయిందోనన్నది మిస్టరీగానే మిగిలిపోయింది.

★

